రేపు హనుమాన్ జయంతి పూజలు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో శ్రీహనుమాన్ జయంతి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పి. నాగిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు ఆలయ అర్చకులు యోగానంద లక్ష్మీనరసింహా చార్యుల సమక్షంలో దాసాంజనేయ స్వామికి అభిషేకం, అర్చనలు, సహస్ర నామార్చన, పంచామృతాభిషేకం, మహా నివేదన, ఊరేగింపు ఉంటాయని తెలిపారు. అదే విధంగా కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు సమీపంలోని శ్రీ రంగనాయక స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ఆంజనేయ స్వామికి సుగంధ పరిమళాలతో అభిషేకం, సింధూర పూజ, నాగవల్లి పత్రిక పూజ, విశేష పుష్పాలంకరణ, మన్యసూక్తంతో హోమం వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

బాలానగర్: బాలానగర్ ఓల్డ్ విలేజ్‌లోని పురాతన హనుమాన్ దేవాలయాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డితో కలిసి మంగళవారం సందర్శించి పూజలు నిర్వహించారు. తన సొంత నిధులతో ఆలయ ప్రహరీ, ధ్వజస్తంభం ఏర్పాటుకు పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, ఎలిజాల యాదగిరి, దేవాలయ కమిటీ సభ్యులు ఖాజా, బాబా, మహిళా నాయకులు కవిత, సుజాత గౌడ్, భారతి, రేణుక, సులోచన తదితరులు పాల్గొన్నారు.

ఎదుగుదలను ఓర్వలేకనే ఆరోపణలు

కూకట్‌పల్లి: రాజకీయంగా తన ఎదుగుదలను ఓర్వలేకనే కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తనపై పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు పూర్తిగా నిరాధారం అన్నారు. నిజాలు ఏనాటికైనా బయటకు వస్తాయని తెలిపారు. లీగల్‌గా ముందుకు వెళ్తానన్నారు.

రోడ్డు ఆక్రమణలు తొలగింపు

- సుమారు 15 షాపుల కూల్చివేత
- ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



పోలీసుల బందోబస్తు

మూసాపేట: మూసాపేట చౌరస్తా నుంచి ఆంజనేయనగర్ చౌరస్తా వరకు రోడ్డు ఆక్రమించి చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు, షట్టర్ల ముందు వ్యాపారాలను మున్సిపల్ అధికారులు మంగళవారం తొలగించారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ కరుణాకర్ సమక్షంలో పోలీసుల బందోబస్తు మధ్య ఆక్రమణలు తొలగించారు. సుమారు 15 షాపుల ముందు ఆక్రమణలు తొలగించామని అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సుమారు 50 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మూసాపేట ప్రభుత్వ పాఠశాల ముందు ఉన్న రేకుల షెడ్లలో నడుస్తున్న వ్యాపారాలను పూర్తిగా తొలగించారు. నర్సింహా స్వామి ఆలయం ముందు ఉన్న 4 షాపులను తొలగించారు. రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

రోడ్డు వెడల్పునకు ఇంకెనాళ్లు?

మూసాపేట చౌరస్తా నుంచి ఆంజనేయ చౌరస్తా వరకు 100 అడుగుల రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి దశాబ్దం అయినా ఇప్పటికీ పనులు కాలేదు. రోడ్డుపై ఉన్న భవనాల యజమానులకు కొందరికి నష్టపరిహారం అందించారు. ఇంకా మిగిలిన భవనాల తొలగింపు పనులు చేయలేదు. అందరికి నష్టపరిహారం చెల్లించిన అనంతరం భవనాలు తొలగించి రోడ్డు వెడల్పు చేస్తేనే ట్రాఫిక్ సమస్య తీరుతుంది. అంతేకానీ చిరు వ్యాపారులకు నష్టం వాటిల్లే విధంగా వారి షాపులను, సామాగ్రిని ధ్వంసం చేయటంతో ప్రయోజనం ఉండదని పలువురు పేర్కొన్నారు. మళ్లీ రెండు రోజుల తరువాత పరిస్థితి మళ్లీ మొదటికే వస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

షాపులు కూల్చటం సరికాదు

ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ఉన్న చిరువ్యాపారుల షాపులను కూల్చటం సరికాదని మూసాపేట కార్పొరేటర్ మహేందర్ అన్నారు. తొలగించిన షాపులను ఆయన పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడినప్పుడు చిరువ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలన్నారు. ముందస్తు సమాచారం ఇచ్చి ఉంటే వ్యాపారులకు నష్టం జరగకుండా ఉండేదన్నారు.





రోడ్డు ఆక్రమణ వ్యాపారాలను తొలగిస్తున్న సిబ్బంది

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మోతీనగర్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ అన్నారు. మూసాపేట డివిజన్ మోతీనగర్, ఎక్స్‌టెన్షన్ కబీర్‌నగర్, అవంతినగర్‌లోని శివ రామాంజనేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం నిత్యనిధి రుద్రాభిషేకం, రుద్రహోమం స్వామిజీ కరకమలములచే శ్రీ ఆంజనేయ స్వామికి 36 కలశాలచే అభిషేకం నిర్వహించారు. అనంతరం నాగవల్లి, దళార్చన, స్వామివారి అనుగ్రహ భాషన ఇచ్చారు.



బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ

మూసాపేట: కూకట్‌పల్లి ఏసీపీగా రవికిరణ్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు తెలంగాణ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని సూచించారు.

చెత్తా చెదారం తొలగింపు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ డి బ్లాక్‌లో భూగర్భ డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సబిహాబేగం మాట్లాడుతూ.. చెత్తాచెదారంతో డ్రైనేజీ పొంగడం వల్ల వాహనదారులు, చుట్టు పక్కల వారు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీంతో ఎయిర్‌టెక్ మిషన్‌తో సీవరేజ్ వర్కర్ల సహాయంతో పేరుకున్న చెత్తను తొలగించినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయండి

మోతీనగర్: అల్లాపూర్ విభాగం విద్యుత్‌శాఖ ఫోన్ నెంబర్లలో మార్పు చోటు చేసుకుందని ఏఈ రాకేష్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఎఫ్ఓసీ ఎమర్జెన్సీ నెంబర్ 871246924, అసిస్టెంట్ ఇంజినీర్ 8712469616 నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

మూసాపేట: విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నెంబర్లు మార్చామని ఆ శాఖ అధికారులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయినా, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా, విద్యుత్ సమస్యలు ఏర్పడినా ఈ నెంబర్లకు సమాచారం అందజేయాలని అధికారులు కోరారు. బాలాజీనగర్ ఎఫ్ఓసీ 8712469625, సెక్షన్ ఏఈ 8712469617, కేపీహెచ్‌బీ ఏడీఈ 8712469612, డీఈ 8712469611 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

కేపీహెచ్‌బీకాలనీ: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్ రైతు బజార్ వద్ద చెత్తా చెదారం ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో చెత్తా చెదారం వేయవద్దని, పరిశుభ్రంగా ఉంచాలని రైతుబజార్ అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ధర్మారెడ్డి కాలనీలోని గాంధీ పార్కును పరిశీలించి మౌలిక సదుపాయాలకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో వెంకట రెడ్డి, ఎస్ఆర్‌పీ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏ ముక్కా శివ, రామకృష్ణయ్య, గోపాల్, ప్రసాద్, శ్రీనివాస్, ప్రవీణ్, బీఎస్ రెడ్డి, శేఖర్, సత్యనారాయణ, ఉన్నం శ్రీను, శుభ, మహేశ్వరి, వనజ, రవళి తదితరులు పాల్గొన్నారు.



రైతుబజార్ వద్ద పరిసరాలను పరిశీలించి మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

చెత్తను రిక్షా కార్మికులకు అందజేయాలి



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో వాటర్ ట్యాంకర్ ప్రహరీ పక్కన చెత్త పేరుకుపోయింది. కాలనీకి చెందిన శ్రీనివాస్ తన సొంత ఖర్చులతో చెత్తను శుభ్రం చేయించారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం కాలనీకి వెళ్లి శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్తా చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఉదయం వచ్చే రిక్షా కార్మికులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో గుడ్ల శ్రీనివాస్, షౌకత్ అలీమున్నా, సీహెచ్. భాస్కర్, అగ్రవాసు, మోజెస్, మహేష్, రసూల్, రవి, రాఘవచారి, కృపాచారి, శంకర్, నరసింహా గౌడ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పని చేయని వాటర్ ఏటీఎంలు

- 5 నెలలుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న వాటర్ ఏటీఎం

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన వాటర్ ఏటీఎంలు అలంకారప్రాయంగా మారాయి. ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించాలని బాలానగర్ డివిజన్ పరిధిలోని (గడ్డిచేను) వినాయకనగర్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ఏటిఎం 5 నెలలుగా పని చేయటం లేదు. ఎండలు మండిపోతున్నాయి. వాహనదారులకు, పాదచారులకు దాహార్తి తీర్చే లక్ష్యంతో అధికారులు వాటర్ ఏటీఎంలు ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ఏటీఎంలు ప్రజల ఆదరణ పొందాయి. డివిజన్‌లో దిల్‌కుషన గర్, ఫిరోజ్‌గూడ, రాజీవ్‌గాంధీ నగర్‌లలో ఏర్పాటు చేసిన వాటర్ ఏటీఎంలు మూతపడ్డాయి.

అందుబాటులో లేక..

భగభగ మండుతున్న ఎండాకాలం మధ్యాహ్న సమయంలో రహదారులపై సంచరిస్తున్న వారు దాహార్తి తీర్చుకునేందుకు వాటర్ బాటిల్స్ కొనుగోలు చేస్తున్నారు. కేవలం 5 రూపాయలకే 10 లీటర్ల వాటర్ వాటర్ ఏటీఎం ద్వారా లభించేది. దీంతో చుట్టు పక్కల కాలనీల వారు ఇక్కడి వాటర్ ఏటీఎంల నుంచి నీరు తీసుకొని వెళ్లేవారు. అది పని చేయకపోవడంతో అధిక ధరలకు వాటర్ క్యాన్‌లు కొనుగోలు చేస్తున్నామని ప్రజలు వాపోతున్నారు.

వినియోగంలోకి తేవాలి



సెంటర్‌లో కార్మికులు ఎక్కువగా ఉంటారు. నిత్యం పలు పనులపై తిరిగే ప్రజల దాహార్తి అధికారులు తీర్చాలి. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వాటర్ ఏటీఎంలను వినియోగంలోకి తేవాలి. అధికారులు స్పందించి నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది.
– దేవేందర్‌రెడ్డి